# మురళి

కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు



కామరూప దేశానికి ఉత్తరదిశలో ఉన్నత పర్వతాలున్నాయి. ఆపర్వతపంక్తుల్లో మురళీ గాయకుడైన ఓ యువకుని పాషాణ ప్రతిమ వుందని ఆ ప్రాంతంలో ఓకిం వదంతి వ్యాపించి వుంది. ఆయువకుని కోసం అన్వేషిస్తూ అతని ప్రియురాలు శిలగా మారిన ప్రియుణ్ణి చూచి వీడిపోలేక దుర్భరశోకంతో విలపించి విలపించి అక్కడే పర్వతాల్లో ప్రాణాలు విడిచిందట. అందుకు నిదర్శనంగా, అంతిమ అవశేషాలుగా ఆ ప్రియురాలి అస్థికలు పాషాణ ప్రతిమ చరణాల దగ్గర పడివున్నాయంటారు.

అయితే, ఇప్పుడవేమీ మనకు కనిపించవు. శతాబ్దాలు గడిచిపొయ్యాయి. భూకంపాలవల్ల పర్వత మయమైన ఆ ప్రదేశం ఎన్నోమార్లు భూగర్భంలో విలీనం కావడం జరిగింది. అయినా ఆయువకుని మధురమైన మురళీ స్వరం అప్పుడప్పుడు వినిపిస్తుంటుందని అక్కడి జానపదులంటారు. అన్ని ప్రాంతాల్లోవున్న కింవదుల్లాగే కామరూప ప్రాంతపు జనుల జీవన ధమనుల్లో నేటికీ ఈ పుక్కిటి కథ ప్రవహిస్తూనే వుంది.

ప్రకృతి సౌందర్య నిలయమైన భద్రవతీ నదీ తీర ప్రాంతంలో విద్యార్థిగా కాలం గడుపుతున్న పుండరీకునితో ఈ కథ ప్రారంభమవుతుంది. పుండరీకుడికి సంగీతమంటే చాలా ఇష్టం. స్వయంగా వెదురుతో పిల్లనగ్రోవిని చేసుకుని సంగీతసాధన ప్రారంభించాడు. నదీతీరంలో కూర్చుని ప్రకృతి పులకించేట్లు మధు మధుర రాగాల్ని ఆలపించేవాడు మురళితో. అయినా ఎంతకీ పుండరీకుడికి సంతృప్తి కలిగేదికాదు. అతని అసంతృప్తిని చూచి తండ్రి అప్పుడప్పుడు చెబుతుండేవాడు సంగీత విద్యావిశారదుడైన సూరదాసు దగ్గర శిక్షణ పొందితే పరిపూర్ణత లభిస్తుందని. సంగీత సాధనలో అతని కళాహృదయం సంపూర్ణ వికాసాన్ని పొందింది.

పుండరీకుడు మురళిని మ్రోయిస్తున్నప్పుడు ముగ్ధురాలై వింటుండేది సునంద. సునంద వల్లభిలో పేర్మోసిన ధనవంతుడి కూతురు. బాల్యస్నేహం సునందా పుండరీకుల మధ్య ప్రణయంగా మారి లతలా అల్లుకు పోయింది. సునంద సన్నిధిలో అతని మురళి మోహన రాగాల్ని ఆలపించేది.

ప్రతి వసంతంలో వల్లభీనగరంలో సంగీత శాస్త్రజ్ఞుల సమ్మేళనం జరిపేవారు. వివిధదేశాల సంగీత శాస్త్రజ్ఞులంతా అందు పాల్గొనేవారు. ఈసారి సమ్మేళనానికి మధుర గాయకుడు సూరదాసును ఆహ్వానిస్తున్నారని తెలిసి పుండరీకుడు ఆనందాతిరేకంలో పొంగిపోయాడు. తన సంగీత ప్రావీణ్యాన్ని చూపి గురుదేవులు సూరదాసు ఆశీర్వాదాల్ని పొందే మధుర ఘడియ ఎప్పుడా అని ఆతురతతో ఎదురు చూస్తున్నాడు.

సమ్మేళనం ప్రారంభమైంది. సూరదాసును కలుసుకోవాలని పిచ్చెక్కినట్లు తిరుగుతున్నాడు పుండరీకుడు. సమ్మేళనానంతరం కాషాయాంబరాలు తాల్చిన ఓ గంభీర వృద్ధమూర్తి అతని ఎదుట సాక్షాత్కరించాడు. దివ్యకాంతితో అతని ముఖం ప్రకాశిస్తోంది. పుండరీకుణ్ణి చూస్తూ 'వచ్చాను పుండరీకా! నేనే సూరదాసుని''అన్నాడు.

ఆదర భావంతో వంగి ప్రణామం చేశాడు పుండరీకుడు. కాస్త ఆగి ప్రశాంత గంభీర స్వరంతో వృద్ధుడన్నాడు ''నేను నీ వేణుగానాన్ని గురించి సర్వం విన్నాను. ఇవాళ సాయంత్రం నాకు నీ మురళిని వినిపించు. విన్నాక నిర్ణయిస్తాను నీ సంగీత ప్రావీణ్యమెంతో.''

పుండరీకుడేమీ మాట్లాడలేకపొయ్యాడు. మళ్లీ వృద్ధుడన్నాడు ''నదీతీరంలో వున్న మందిరంలో వుంటాను నేను. సూర్యాస్తమయ సమయానరా. నీకోసం నిరీక్షిస్తుంటాను.''

వెళ్లిపొయ్యాడు సూరదాసు. ఆనందంతో ఉప్పొంగిపోయిన పుండరీకుడు ఆగంభీరమూర్తికి మరొకసారి కరద్వయి మోడ్చి ప్రణామం చేశాడు.

• • •



పుండరీకుడు ఇంటిదారి పట్టి రివ్వున దూసుకుంటూ పోతున్నాడు. దారిలో చూతవృక్షం క్రింద నిల్చున్న సునందని కూడా చూళ్లేదు. సునంద అతనికి దగ్గరగా వచ్చింది. సునందని చూడగానే బిగ్గరగా అన్నాడు "సునందా! నా ప్రియ సునందా! నా కోరిక తీరింది. నేటితో నా కోరిక తీరింది"

"ఏమిటా కోరిక" ఆశ్చర్యంగా అడిగింది.

గురుదేవులు సూరదాసు నాకు దర్శనమిచ్చారు. సాయంత్రం నా మురళీ వాద్యాన్ని పరీక్షిస్తారు. అందులో ఉత్తీర్ణుణ్ణయ్యానా సునందా. . .నా సమస్త సంగీత సాధనని నీకే సమర్పిస్తాను. ఎందుకంటావా నా ఈ సాధనకు కారకురాలివి నువ్వే. నీకోసమే నా సాధన. నిజం, సునందా! నువ్వే లేకుంటే నాకిదంతా ఎందుకు ?"

"అయితే గురుదేవులకి మరో కొత్త రాగాన్ని కూడా వినిపిస్తావన్నమాట — రాగసునందని."

సాయంత్రమైంది. నదీతీరాన వున్న జీర్ణ మందిరానికి చేరుకున్నాడు పుండరీకుడు. వృద్ధ పూజారి నిమీలిత నేత్రాలతో కాళీవందనం చేస్తున్నాడు. పుండరీకుని ఆగమనాన్ని గమనించాడేమో ముఖం త్రిప్పకుండానే "నాయనా పుండరీకా! అలా కూర్చో. నీకు వచ్చిన, బాగా వచ్చిన సర్వశ్రేష్ఠమైన రాగాన్ని ఆలాపించు. బాగా గుర్తుంచుకో సుమా! ఇక్కడ నీ ప్రతిభా వ్యుత్పత్తులు చూపకు. సంగీతం ప్రేమపూర్ణమైన హృదయంలోంచి రావాలి. వినిపించు. హృదయంతో వినిపించు." అన్నాడు.

పుండరీకుడు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అతనికి ఆత్మీయమైన, ప్రియమైన మురళి అతని చేతుల్లో వుంది. కొద్ది క్షణాలు గడిచాయి. మురళిలోంచి మధుర మంజుల స్వరాలు అలలు అలలుగా లేచి వాయుమండలంలో వ్యాపించి పోతున్నాయి. సమస్త ప్రకృతి తన్మయించి చైతన్య రహితమై పోయింది. పుండరీకుని హృదయ గర్భంలో సుధాధుని పెల్లుబికింది. ఆత్మ, మురళీ స్వరంలో లీనమైంది. ఏ సంగీత లాక్షణికుల ఆదేశాలకూ లొంగకుండా మ్రోగుతోంది. పరం పరాగతమైన సాంధ్యకాలీన రాగం కూడా అతనికి జ్ఞాపకంలేదు. వేణువులోలీనమైపొయ్యాడు. ఉన్నట్టుండి పూజారి అంటున్నాడు. "పుండరీకా! అలా చూడు అదిగో, సంగీతమూర్తి సరస్వతీదేవి ప్రసన్నమవుతోంది. చూస్తున్నావా! హంసవాహిని సరస్వతిని. వింటున్నావా నీ మురళీ స్వరంలో ఆమె మేళవిస్తున్న వీణాస్వరాల్ని."

పుండరీకుడు కళ్లు విప్పాడు. అందమైన సంధ్య అంధకారంలో కలిసిపోతోంది. తదేకంగా చూస్తున్న పుండరీకునికి అస్తమయ సూర్య కాంతిలో ఏదోదివ్యచ్ఛాయ దృగ్గోచరమైంది.

"పుండరీకా! మురళి వాయించు. ఆపకు! సరస్వతీ మాత సమీపంగా వస్తోంది. ఆపకు! దేవి మనదగ్గరకు వచ్చేవరకు అలాగే వాయించు. నేను మంత్రోచ్చారణ చేస్తుంటాను.

ఇటు మంత్రోచ్చారణా, అటు మురళి అలాపనా రెండూ ప్రారంభమయ్యాయి. ఈసారి మురళిని వాయించడంలో ఏదో విచిత్రమైన మార్పు అనుభవంలోకి వచ్చింది పుండరీకుడికి. మురళి ప్రేరణావశం కాకుండా యాంత్రికంగా మ్రోగుతోంది. మురళీస్వరంలో మాధుర్యం నశించింది. రెప్ప వాల్చకుండా ఆ దివ్యరూపాన్ని చూస్తున్నాడు. ఉన్నట్టుండి ఆ దివ్యరూపిణి వాహనమైన హంస మాయమైంది. ఆశ్చర్యపోతూ ఇంకా ఏం జరుగుతుందోనని అనిమిష నేత్రాలతో చూస్తున్నాడు. ఒకటొకటిగా దేవి సకలాభరణాలూ మాయమైపోతున్నాయి. తుదకు దరిద్రత గూడుకట్టుకున్న బికారిలా తయారయింది. కల్యాణి రూపిణి సరస్వతీదేవి. ఇంకా దగ్గరకు వస్తోంది. తత్క్షణమే వృద్ధ పూజారి లోంచి పైశాచిక వికటాట్టహాసం గుండె అదిరిపొయ్యేలా వినిపించింది. భయకంపితుడైపోయాడు పుండరీకుడు. వృద్ధుడంటున్నాడు బిగ్గరగా "పుండరీకా! నీవు గొప్ప సంగీతజ్ఞుడివి. ఈ విశ్వాసంతో ఇంటికి వెళ్లు. నీయశః కౌముదులుదశదిశలూ ప్రాకుతాయి. ఇవాళనువ్వు చూచిన ఈ దృశ్యాల్ని మరిచిపో. ఎప్పుడూ జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించకు."

• • •

పుండరీకుడు మౌనంగా ఇంటిదారి పట్టాడు. అయితే ఈ ఘోర దుర్ఘటన మూలంగా అతని హృదయం భయాందోళనలతో కంపించి పోతోంది. ఏదో శాపం అతని జీవితాన్ని త్రాచుపాములా కాటువేసినట్లు మనసు ఘోషిస్తోంది.

అధ్యయనశాలలో అడుగుపెట్టిన పుండరీకుడికి ప్రథమంగా గురువైన పరీక్షిత్తు కనిపించాడు. జరిగిందంతా ఏకరువు పెట్టాడు గురువు ముందు. తీవ్రంగా ఆలోచించి గురువిలాఅన్నాడు. "ఎంతపని చేశావయ్యా పుండరీకా! అతడు సూరదాసు కాదు. కాళికారాధకుడు. సరస్వతిని ప్రసన్నం చేసుకోవడానికి ఏళ్లపర్యంతంగా ప్రయత్నం చేస్తున్నాడు. తను మహామానవుడు కావాలని అతని ఆశ. తపోబలంతో, మంత్ర తంత్ర సాధనాలతో సరస్వతిని ప్రసన్నం చేసుకున్నాడు. అందుకు నిన్ను వినియోగించుకున్నాడు. దేవి ప్రత్యక్షమై అతని కోరికను వెలిబుచ్చమంది. అతడు స్వయంగా దేవినే కోరుకున్నాడు. అది కళారాధకులకు మాత్రమే సాధ్యమవుతుందనీ, తాను మహాశక్తి కాళికచేత అనుగ్రహితమైన దానిననీ చెప్పి తుదకు దేవి అతని దాసి కావడానికి తయారైంది వాక్పాలన కోసం. నిన్ను తనస్వార్థానికి వినియోగించుకున్నాడు పుండరీకా! వాడు దుర్మార్గుడు. మహామాంత్రికుడు."

పుండరీకుడికి మనస్సంతా వికలమైపోయింది. ఆరాత్రి అంతా నిద్రలేకుండా అశాంతిగా గడిపాడు. ఎల్లాగైనా సరే, ఆవంచకుణ్ణి పట్టుకొని దేవి విముక్తి కలిగించాలనుకున్నాడు. తెల్లవారగానే ప్రయాణమై ముందుగా సునంద దగ్గరకు వెళ్ళి కథంతా వివరించి — అవశ్యం ఆదుర్మార్గుణ్ణి పట్టుకోవాలి సునందా! త్వరలోనే నిన్ను కలుసుకుంటాను — నాకోసం దిగులు పెట్టుకోకు" అన్నాడు. అవే సునంద చివరిసారిగా ప్రియుని నోటంట విన్నమాటలు.

పుండరీకుడు ఆకపట సాధువును అన్వేషిస్తూ బయలుదేరాడు. దేశదేశాలూ తిరుగుతూ కాళికాలయాలన్నీ శోధిస్తున్నాడు. ఇటు సరస్వతీ పవిత్ర స్పర్శలేక, సాహిత్య, సంగీత, శిల్ప, నృత్య కళారామాల్లో శిశిరం ప్రవేశించింది.

• • •

దినాలు. . వారాలు — మాసాలు గడిచిపోతున్నాయి. పుండరీకుని దగ్గరనుంచి ఏసమాధానమూ లేదు. క్షణాలు యుగాలుగా గడుపుతోంది సునంద. అప్పుడే మూడేళ్లు గతించాయి. దుర్భర విరహంలో సునంద ప్రియాన్వేషణకై బయలుదేరింది.

ఇక్కడ పుండరీకుడు కాళికాలయాల్ని వెదుక్కుంటూ కామరూపలో కామాక్షి మందిరానికి చేరుకున్నాడు. మందిరం పర్వతాగ్రాన వుంది. దూరంగా ఓ స్త్రీ నిల్చుని వుండడం గమనించాడు పుండరీకుడు. ఎక్కడో ఆమెని చూసినట్లు తోచి ఆమెకు దగ్గరగా వొచ్చాడు. భద్రవతీ నదీతటాన ఆమెని చూసినట్లు వచ్చింది. సాహసించి అడిగాడు. "అమ్మా! మిమ్మల్నెక్కడో చూచినట్లున్నాను. ఇంతకు ముందు ఎక్కడ వుండేవారు ?"

ఆమె ప్రశాంత కోమల స్వరంతో జవాబిచ్చింది. "నాకూ నిన్ను చూస్తుంటే ఏదో అనుభూతి కలుగుతోంది నాయనా! ఏదో విడదీయరాని సంబంధం మనిద్దరి మధ్యా వున్నట్లనిపిస్తోంది. అంతకుమించి నాకేమీ జ్ఞాపకం లేదు. నేను. . ఇక్కడే. . . ఈ కొండమీద ఓ కుటీరంలో నివసిస్తున్నాను."

"సరిగ్గా జ్ఞాపకంలేదు. ఎప్పుడో ఓ నదీ తీరమ్మీద ఓ సాధువు నన్ను అచేతనురాల్ని చేసి ఆశ్రయమిచ్చాడు. ఏకాంతం దొరికినప్పుడు ఏవో జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నిస్తాను. కాని ఏవీ జ్ఞాపకం రావు."

"ఆ సాధువెక్కడ ?"

"పూజకోసం మందిరానికి వెళ్లాడు. మధ్యాహ్నానికి తిరిగిరావొచ్చు."

పుండరీకుడు ఆమె దగ్గర సెలవు తీసుకుని ఏదో ఆలోచించి మందిరం వేపు నడక సాగించాడు. కొంచెం దూరం వెళ్లేసరికి మధ్యేమార్గంలో దుర్బల శరీరంతోవున్న ఓవృద్ధుడు కనిపించాడు. అతడే సూరదాసునని చెప్పి పుండరీ